# కలం మనిషి

సోమేశ్వర్ మా సందులోనే అద్దెకుంటున్నాడు. నాలానే సోమేశ్వర్ కూడా బ్రహ్మచారి. అతనికీ ఇంగ్లీషు సినిమాల పిచ్చి వుంది నాలాగే. మా పరిచయం అందువల్ల దృఢపడింది.

ప్రతి ఆదివారం ఫస్ట్ షోకి నేను, సోమేశ్వర్ కలిసి ఏదో ఓ ఇంగ్లీషు సినిమాకి వెళ్ళడం తప్పదు. సోమేశ్వర్‌కి స్నేహితు లెక్కువ.

అందుకు కారణం సోమేశ్వర్ కథకుడు. నవలలు, గేయాలలాంటివి వ్రాయడు. కేవలం చిన్న కథలే వ్రాస్తాడు కాబట్టి కథకుడంటున్నాను. సాధారణంగా అతని స్నేహితులు కథల గురించే మాట్లాడుకుంటుంటారు కాబట్టి. సోమేశ్వర్ కథలంటే నాకు అంతో ఇంతో ఆసక్తి ఏర్పడింది.

సోమేశ్వర్ కథలు అప్పుడప్పుడు చదువుతుంటాను, అతని గదికి వెళ్ళినప్పుడు. తన కథలు అచ్చయిన పుస్తకా

లనేకం సోమేశ్వర్ గదిలో టేబిల్మీద చిందరవందరగా పడుం టాయి యెప్పుడూ.

కథలు తప్పక చదవాలనే ఆసక్తి నాకు ఎప్పుడూ లేదు. రచయితలతో స్నేహం చేసుకోవాలనే ఇంట్రస్ట్ కూడా లేదు నాకు. కథలకి అనేక చక్కటి ఆలోచనలు వస్తూంటాయి కాని వాటిని కాగితంమీద ఎలా దింపాలో పద్ధతి తెలియదు.

ఆలోచిస్తే, అయిదారు రోజులు కష్టపడితే తెలు స్తుంది. కాని నాకంత వోపికలేదు. నాలా అలా వోపిక లేని అనేకమంది కూడా తమ ఆలోచనలని కాగితం మీదకి ఎక్కించలేరు కాని, వ్రాయగలిగితే మంచి రచనలే చేయ గలరని సోమేశ్వర్తో అంటే సోమేశ్వర్ నవ్వుతాడు.

సోమేశ్వర్ గదిలో ఓ బైండ్ చేసిన పుస్తకంవుంది. ఆ పుస్తకంలో సోమేశ్వర్ చేతి వ్రాతతో, అతను వ్రాసిన శతాధిక కథలు వున్నాయి. ముందర ఆ పుస్తకంలో వ్రాసుకొని, తర్వాత కథని కాగితాల మీద నీట్గా తిరగ రాసి పంపుతూంటాడు సోమేశ్వర్.

ఓసారి మేన్యుస్క్రిప్ట్ బైండ్ని తిరగేస్తూంటే వో ఇంగ్లీషు టైటిల్ నా కళ్ళ బడింది. చిన్నకథ అది. దాని పేరు 'ఒన్స్ ఏ థీఫ్' కథపేరు బావుంది. అనుకోవడంవల్ల నేనా కథని కొద్దిగా వుత్సాహంగా చదివాను. సోమేశ్వర్ బాత్ రూమ్లో బట్టలు పిండుకుంటుంటే. చిన్నకథే అయినా. మంచి కథ అది. క్లుప్తంగా ఆ కథావస్తువు యిది.

ఓ ఆదర్శవాది ఇంట్లో అర్ధరాత్రి దొంగ ఒకడు ప్రవేశిస్తాడు. డబ్బు దస్కం మూటకట్టుకుని పారిపోబోతుంటే పట్టుబడతాడు. ఆ ఆదర్శవాది ఆ దొంగని పోలీసులకి అప్ప గించడు. చావ చితక తన్నడు. ఆ దొంగని ఆ పరిస్థితులకి దిగజార్చిన సంగతులడిగి తెలుసుకుంటాడు. ఆ దొంగ అంటే సానుభూతి ఏర్పడుతుంది. ఆ దొంగకి ఓ వంద రూపాయలు యిస్తాడు. ఆ దొంగచేత తన ఇంటిదగ్గరే కూరల వ్యాపారం ప్రారంభం చేయిస్తాడు

క్రమంగా ఆ దొంగ. తన దొంగ బుద్ధిని మానుకుని, కూరల వ్యాపారంలో స్థిరపడి, సంఘంలో మంచి మనిషిగా బ్రతుకుతాడు. మంచివాడుగా మారిపోతాడు.

నాకా కథ బాగా నచ్చింది. దొంగతనాలు చేసే దొంగలని మంచిమార్గంలోకి మళ్ళించే విధానాన్ని తెలియ చేసే ఆ కథ నాకు అమితంగా నచ్చింది. సంఘంలో దొంగ తనం ఓ ప్రాథమిక సమస్య దానికి పరిష్కారంగా మలచ బడిం దీ కథ. అలాంటి అవినీతిపరుడుని మంచి మార్గంలోకి పెట్టాలి అనే సందేశం వుంది ఆ కథలో. ఆ కథ వెనక అందమయిన, ఆరోగ్య కరమయిన ఆలోచన వుంది.

కథ బావుందన్నాను సోమేశ్వర్‌తో. పిండిన తడి బట్టలని గదిలో తీగలమీాద ఆరేస్తూ చెప్పాడు సోమేశ్వర్ నాతో.

“నిజమే. ఆ కథ బావుందని చాలామంది వుత్తరాలు వ్రాశారు, ఒక సందేశం యిచ్చే కథ అది. నీకు తెలుసుగా. అమ్మాయిలకి నచ్చే అందమయిన ప్రేమకథలు వ్రాయలేను నేను. యిలాంటి సంఘానికి పనికివచ్చే కథలు వ్రాయమంటేనే నా కిష్టం. నా ప్రతీ కథా, దాదాపుగా యిలాగే యేదో ఓ సందేశాన్ని యిస్తుంది పాఠకులకి. అందుకే నా కథలంటే చాలామందికి యిష్టం.”

“యీ కథ ఎలా వ్రాశావు ? యింత మంచి అయిడియా ఎలా తట్టింది ?” అడిగాను తెలుసుకోవాలని.

కథల గురించి యింత డైరెక్టుగా సోమేశ్వర్ని నేను అంతకు మునుపెన్నడూ అడగటం జరగలేదు కాబట్టి కామోసు వివరంగా చెప్పాడు

“ఇది వరకిల్లా కథ చదివి బావుంది, బావుళ్ళేదు అని మాత్రమే అనేవాడివి నువ్వు. ఇప్పుడు అడుగుతున్నావు కాబట్టి చెపుతున్నాను. ఆ కథ వ్రాయబోయేముందు, రెండు మూడు నెలల క్రితం పాల్వంచ వెళ్ళాను, యేదోపని మీద. నేనుంటున్న యింట్లో అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రెండు మూడు రోజుల తర్వాత ఆ యిద్దరినీ పట్టుకున్నారు.

దొంగిలించిన సామాను యెక్కడ దాచిందీ చెప్పించడానికి కొట్టారు. చెప్పిన తర్వాతకూడా, దొంగతనం చేశారనే కోపంతో వాళ్ళిద్దరినీ బాగా కొట్టారు స్తంభానికికట్టేసి. ఆ సంఘటన నా మనస్సులో హత్తుకుపోయింది. ఓసారి

దొంగయినవాడు యెప్పటికీ దొంగగానే బ్రతకాల్సిన అవసరం లేదనిపించింది. ఫలితంగా యీ కథ వ్రాశాను."

చిన్నగా నవ్వాను.

"ఒక్క అయిదు నిముషాలాగి, 'ఏ మేన్ కాల్డ్ హార్స్' అనే మంచి సినిమా ఆడుతోంది, వెళదాం" అన్నాడు.

నేను మిగతా కథలు తిరగేయసాగాను.

దాదాపు పదిరోజుల తర్వాత సెకండ్ షిఫ్ట్ అయాక నేను ప్లేంట్ నుండి తిరిగివస్తూంటే, సర్కస్ బుక్కింగ్ ఆఫీస్ ముందు చాలామంది జనం చేరి యెవరినో కొట్టడం చూసి అటు వెళ్ళాను యేమిటో చూద్దామని.

దాదాపు పాతికేళ్ళ వ్యక్తిని బాదుతున్నారు జనం. అతనికి ముక్కులోంచి, నోట్లోంచి రక్తం కారుతోంది. పర్స పిక్‌పాకెట్ చేశాడుట అంతకు ముందే. పాపం, దొరికి పోయాడు.

నేను వాళ్ళని వారిస్తూ చూశాను పర్స పోయి దొరికిన ఆ వ్యక్తి వంక. కోపంగా చెయ్యి యెత్తుతున్నాడతను మరోసారి ఆదొంగమీదకి. నన్నుచూసి గుర్తించి ఎందుకో చటుక్కున చెయ్యి దింపేశాడు.

సోమేశ్వర్ అతను.

సో... సోమేశ్వర్ కేవలం కలంమనిషే? ***